

గిరిజన వర్సిటీలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

విజయనగరం దాసన్నపేట, మే 22: కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సుల ప్రవేశాలకు గడువును ఈ నెల 25వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్టు వైస్ చాన్సలర్ తేజస్వీ కట్టమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎన్‌టీఏ నిర్వహించిన సీయూఈటీ, పీజీ పరీక్ష రాసినవారు వెబ్‌సైట్ ద్వారా తమ పేరును రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, లేదా 63004 43499 నెంబర్‌ను యూనివర్సిటీ విధుల సమయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

జీవ వైవిధ్యం దైన్యం

నేడు ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం

- జిల్లాలో పెరగని చెట్ల పెంపకం
- వేసవిలో అత్యధిక ఉష్ణోగ్రతలతో అనేక పాట్లు
- కొండ ప్రాంతాల్లో అడవి పందుల వేట
- పశువులపై పులి దాడి
- తెర్లాం మండలంలో జనంలోకి ఏనుగులు

ప్రకృతికి అనుబంధంగా మానవ జీవనం సాగితే అందం.. ఆనందం.. జీవ వైవిధ్యం. నేడు పర్యావరణానికి వ్యతిరేకంగా మనిషి అడుగులు పడుతున్నాయి. పర్యవసానంగా కరోనా వంటి తీవ్ర అపాయాన్ని మనిషి ఎదుర్కోవాల్సి వచ్చింది. జీవ వైవిధ్యానికి దూరంగా వెళ్తే.. ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా ప్రయాణం సాగితే కలిగే దుష్పరిణామాలను ఊహించలేం. జిల్లాలో కొంతకాలంగా అనేక ఊహాతీత ఘటనలు జరుగుతున్నాయి. పశువులపై పులి దాడి.. తెర్లాం మండలంలో జనారణ్యంలో ఏనుగుల సంచారం.. చెట్లు మాయం అవుతుండడంతో అనూహ్యంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. నదుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు.. చెరువుల ఆక్రమణలు తదితర ఘటనలు ప్రజలను కలవర పెడుతున్నాయి. మనిషి మనుగడను దెబ్బతీసే ఇలాంటి పరిణామాలకు చెక్ పెట్టే ఉపాయాన్ని ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. గురువారం ప్రపంచ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా జిల్లా పరిస్థితులపై కథనం.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)



తెర్లాం: పంట పొలాల్లో ఏనుగుల గుంపు(ఫైల్)

జిల్లాలో కొన్నాళ్లుగా ప్రకృతి హననం జరుగుతోంది. చెట్లు నరికేయడం.. నదులను ఇసుక తవ్వకాల పేరుతో విధ్వంసం చేయడం.. చెరువులు, గెడ్డలను ఆక్రమించడం.. అటవీ భూములను కబ్జా చేయడం.. తదితర ఘటనలు మనిషి మనుగడనే ప్రశ్నిస్తున్నాయి. వర్షాకాలంలో వస్తున్న వరదలకు ఈ తప్పులే కారణాలని పర్యావరణ వేత్తలు అనేకేళ్లుగా మొత్తుకుంటున్నారు. అయినా అవే తప్పులు జరుగుతూనే ఉన్నాయి. కబ్జాలు నిత్యకృత్యమై పోయాయి. పట్టణాల్లో ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాల వల్ల వర్షం నీరు ఇళ్లపైకి వస్తోంది. రోడ్లను ముంచెత్తుతోంది. ఇదిలా ఉండగా జిల్లాలో ఏనుగుల సంచారం ఎప్పుడూ లేదు. ఉమ్మడి జిల్లాలో మాత్రం చూశాం. అయితే కొద్ది నెలల కిందట తెర్లాం మండలంలోకి ఏనుగుల గుంపు వచ్చి అలజడి సృష్టించాయి. ఒడిశాలోని లఖేరి అభయారణ్యం నుంచి పదేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాకు ఏనుగుల గుంపు వచ్చింది. ఇప్పటికీ మన్యం జిల్లాను వణికిస్తున్నాయి. అయితే కొద్ది నెలల కిందట తెర్లాం మండలంలోని రంగపువలస, తమ్మయ్యపేట ప్రాంతాల్లో ఏనుగులు సంచరించి పంటలను నాశనం చేశాయి. రంగపువలసలో ధాన్యం మిల్లుపై దాడి చేసి ధాన్యాన్ని ధ్వంసం చేశాయి. వరి నారుమడులను నాశనం చేశాయి. అలాగే వంగర మండలంలోని తలగాం గ్రామ పొలాల్లోనూ సంచరించాయి. ఇదిలా ఉండగా జిల్లాలో పెద్ద పులి సంచారం కూడా తీవ్రస్థాయిలో ఆందోళనకు గురిచేసింది. ఎస్.కోట, కొత్తవలస, మెంటాడ, బొండపల్లి, తెర్లాం, వంగర మండలాల్లో ప్రజలను భయాందోళనకు గురిచేసింది. బొండపల్లి మండలం పనసలపాడు గ్రామంలో ఆవులపై దాడి చేసి చంపేసింది. మెంటాడ మండలం బిరసాడవలసలోనూ సంచరించింది. మెంటాడ-అనంతగిరి మండల సరిహద్దుల్లో ఆవులపై దాడి చేసి చంపేసింది. ఇలా అనేక ఘటనలు జరిగాయి. ఏనుగులు, పులి సంచారానికి కారణం వాటి స్థలాల్లోకి మనిషి వెళ్లిపోవడమే. అటవీ భూముల్లో చెట్లు నరుక్కుంటూ పోవడంతో వన్యప్రాణులు, జంతువులు జనారణ్యంలోకి వచ్చేస్తున్నాయి. ఇటు మైదాన ప్రాంతాల్లోనూ ప్రకృతిని కాపాడుకునే చర్యలు పెద్దగా కన్పించడం లేదు.



- విజయనగరం పట్టణంలో సుందరీకరణతో పాటు పర్యావరణ పరిరక్షణకోసం అంటూ చెట్లు నాటారు కాని సంరక్షణ మరిచారు. ఇటీవల నాటిన ఈతచెట్లలో ఒక్కటీ పచ్చగా కనిపించడం లేదు. కొన్ని నేలవాలాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల వెంబడి రెండు వైపులా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపడుతూ ఉన్నారు. తర్వాత నిర్వహణ ఉండడం లేదు. దీంతో 80 శాతం మొక్కలు బతకడం లేదు.

- జిల్లాలోని నదులను విధ్వంసం చేస్తున్నారు. ఎక్కడికక్కడ తవ్వేస్తున్నారు. ఆఖరికి నదుల సహజ స్వరూపాన్ని మార్చేస్తున్నారు. ఫలితంగా వర్షాకాలంలో వరదలు సర్వసాధారణం అయ్యాయి. తీరం వెంబడి గ్రామాలను నదులు ముంచెత్తుతున్నాయి. పట్టణాల్లో రోడ్లు, ఇళ్ల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా సాగడంతో వర్షం నీరు వెళ్లే మార్గం లేక రోజుల కొద్దీ నీరు రహదారులపై నిలిచిపోతోంది. విజయనగరంలోని మార్కెట్ పరిస్థితి ఇందుకో ఉదాహరణ.

- అటవీ విస్తీర్ణం 33శాతం ఉండాలన్నది నిబంధన. కాని ఉమ్మడి జిల్లాలో 23శాతానికి అటవీ విస్తీర్ణం తగ్గినట్లు అంచనా వేస్తున్నారు. దీనికి కారణం ఏజెన్సీలో ఇష్టానుసారం పోడు వ్యవసాయం చేయడం.. అడవులను నరికి బొగ్గులు తయారు చేయడం జరుగుతోంది. దీనిపై ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపడం లేదు.
- అటవీ భూములు, కొండ ప్రాంతాలకు సమీపంలో దుప్పులు, జింకలు, అడవి పందుల వేట అనధికారికంగా సాగుతోంది. వాటని వివిధ మార్గాల్లో పట్టుకుని మాంసంగా తీసుకుంటున్నారు. దీంతో వాటి మనుగడా ప్రశ్నార్థకం అవుతోంది.
- అటవీ ప్రాంతాల్లో అరుదుగా కన్పించే కింగ్ కోబ్రా జాతి పాములు కనుమరుగవుతున్నాయి. ఏప్రిల్.. మే నెలల్లో ఇవి ఎక్కువగా మక్కువ, సాలూరు మండలాల పరిధిలోని గెడ్డల పరివాహ ప్రాంతాలకు చేరి సంతానోత్పత్తి చేస్తుంటాయి. గత 20 ఏళ్లతో పోల్చితే ఈ అరుదైన పాములు కనుమరుగయ్యాయి. సంతానోత్పత్తి కోసం చల్లని ప్రదేశానికి వచ్చిన ఈ పాములు కొందరి దృష్టిలో పడి హతం అవుతున్నాయి.
- గుగ్గిలం అడవులు విస్తారంగా ఉండేవి. ఇవి రానురాను తగ్గిపోయాయి. మంచి కలప నిచ్చే చెట్లు కావటంతో ద్వార బందాలు, కిటికీలు, ఫర్నీచర్ వంటి వాటికోసం ఈ చెట్లను ఇష్టాసారం నరికేస్తున్నారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాల్లో గుగ్గిలం చెట్లు విరివిగా కన్పించేవి.



విజయనగరంలో ఈత చెట్టు ఇలా..



చంపావతిలో ఇసుక తవ్వకాలు(ఫైల్)

సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం

- రేపటి నుంచి టెన్త్, ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కలెక్టరేట్, మే 22: పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఇప్పటికే ఆయా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందజేశారు. ఈనెల 24 నుంచి 31వరకూ ఇంటర్ విద్యార్థులకు, జూన్ 3వ వరకూ టెన్త్ విద్యార్థులకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి 14,904 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 7927 మంది హాజరు కానున్నారు. జిల్లా వ్యాప్తంగా 42 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఫస్టియర్‌కు ఉదయం 9 నుంచి 12 గంటలు వరకూ సెకెండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రతి పరీక్ష కేంద్రానికీ చీఫ్ సూపరింటెండెంట్, అదనపు చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను, 500 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే పరిష్కరించేందుకు 08922-237988 నెంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

పది పరీక్షలకు 4210 మంది

పదో తరగతి పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 4210 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో 2482 మంది బాలురు, 1728 మంది బాలికలు ఉన్నారు. 19 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్ష జరగనుంది. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు 19 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను , 19 మంది డిపార్టుమెంట్ అధికారులు నియమించారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు 185 మంది ఇన్విజిలేటర్లును నియమించారు.

1 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ మొదటి నుంచి 8వ తేదీ వరకూ జరగనున్నాయి. ప్రతి రోజు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకూ పరీక్షలు జరగనున్నాయి. పదో తరగతి పరీక్షలకు నాలుగు పరీక్షా కేంద్రాల్లో 548 మంది, ఇంటర్ పరీక్షలకు 3 కేంద్రాల్లో 664 మంది విద్యార్థులు రాయనున్నారు. 65 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఆయా విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10 నుంచి 12వ తేదీ వరకూ జరగనున్నాయి.

24న డీఈఈ సెట్

ఈనెల 24వ తేదీ నుంచి డీఈఈ సెట్ పరీక్ష జరగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ జరిగే ఈ పరీక్ష ఆన్‌లైన్‌లో స్థానిక సత్య ఇన్‌స్టిట్యూట్‌లో జరుగుతుంది. మొత్తం 256 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు.

పరీక్షలు పక్కాగా నిర్వహించాలి: కలెక్టర్

ఇంటర్, టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాల్ ప్రాక్టిస్ జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో ప్రేమకుమార్, ఆర్‌ఐవో ఆదినారాయణ, డీవీఈవో భీమశంకర్, జిల్లా వైద్యాధికారి ఎస్.భాస్కరరావు, డీఈసీ సభ్యులు సత్యనారాయణ, కె.అప్పారావు, రామకృష్ణ, అసిస్టెంట్ కంట్రోలర్ టి.సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణపై సమీక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

సైబర్ వలలో అర్చకుడు

- ఖాతా నుంచి రూ 1.21లక్షలు మాయం
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు



డబ్బులు డెబిట్ అయినట్లు వచ్చిన మెసేజ్



మోసపోయిన అర్చకుడు

రాజాం, మే 22: రాజాంలోని చీపురుపల్లి రోడ్డులో ఉన్న వీర హనుమాన్ ఆలయ అర్చకుడు పి. వెంకటసూర్యనారాయణ (రవి స్వామి) సైబర్ వలకు చిక్కి రూ 1.21లక్షలు పోగొట్టుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు పంపిన వాట్సాప్ మెసేజ్‌లోని లింక్‌ను ఓపెన్ చేసి వివరాలన్నీ నమోదు చేయడంతోనే ఈ మోసం జరిగింది. బ్యాంకు నుంచి మెసేజ్ వచ్చినట్లు భావించి మోసపోయాడు. చేసేదిలేక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలిలా ఉన్నాయి.

రాజాం ఐసీఐసీఐ బ్యాంకులో అర్చకుడు వెంకట సూర్యనారాయణకు అకౌంట్ ఉంది. తన అకౌంట్ బ్లాక్ అవుతుందని, వెంటనే పాన్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని ఆయన ఫోన్‌కు సోమవారం ఉదయం మెసేజ్ వచ్చింది. అందులో ఉన్న నంబర్‌కు ఆయన ఫోన్ చేయగా ఆన్‌లైన్‌లో పాన్ కార్డు అప్‌డేట్ చేయాలని గుర్తుతెలియని వ్యక్తి కోరాడు. నిజమేననుకుని అర్చకుడు ఆయన చెప్పినట్లు చేశాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి మరో ఫేక్ మేసేజ్ పంపించాడు. అందులో తన వివరాలన్నీ ఎంట్రీ చేయాలని చెప్పాడు. అంతేకాకుండా సాయంకాలం 6 గంటల 56 నిమిషాలకు + 91 82409 58147 నెంబరు నుంచి మళ్లీ ఫోన్ చేశాడు. ఐసీఐసీఐ బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని హిందీలో మాట్లాడాడు. హిందీ రాదని చెప్పగానే ఇంగ్లీష్‌లో మాట్లాడాడు. అనంతరం అర్చకుని వాట్సాప్‌కు మెసేజ్ పెట్టాడు. అందులోని లింక్ ఓపెన్ చేయాలన్నాడు. ఓటీపీ చెప్పకుండా వాళ్లు ఏమీ చేయలేరు అన్న నమ్మకంతో అన్ని వివరాలు ఎంటర్ చేశాడు. వాళ్లు కాల్ కట్ చేసిన వెంటనే అర్చకుని అకౌంట్ నుంచి రూ.1,21,000 మాయం అయ్యాయి. మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై సీఐ డి.మోహన్‌రావును వివరణ కోరగా బ్యాంకు ఖాతానుంచి డబ్బులు పోగొట్టుకున్న అర్చకుడు ఫిర్యాదు చేయడం వాస్తవమేనని, ఈ విషయంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్లు ఎటువైపో

- అభ్యర్థుల గెలుపోటముల్లో కీలకమయ్యే అవకాశం
- 19 వేలు పైబడి పోలింగ్
- గతం కంటే పెరిగిన శాతం



కలెక్టరేట్, మే 22: ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములపై పోస్టల్ బ్యాలెట్లు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. స్వల్ప తేడాతో గత ఎన్నికల్లో బయటపడిన వారు ఈసారి అటుఇటు కావొచ్చు. జిల్లాలో ఉద్యోగులు అధిక శాతం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేసినట్లు చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఎవరి భవితవ్యం ఎటు మలుపు తిరుగుతుందో అన్న చర్చ ఉద్యోగ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది. నియోజకవర్గాల వారీగా వారు లెక్కలేసుకుంటున్నారు.

గతంలో వలే ఇంటి వద్ద నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే విధానానికి ఈసారి ఎన్నికల సంఘం ఫుల్‌స్టాప్ పెట్టింది. అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయనగరం పార్లమెంట్ పరిధిలో 8,945 మంది ఉద్యోగులే పోస్టల్ బ్యాలెట్లు వేశారు. ఈ సారి 19వేలు పైబడి ఓటు వినియోగించుకున్నారు. గతంతో పోల్చితే పోస్టల్ బ్యాలెట్ వేసేవారి సంఖ్య రెట్టింపు అయ్యింది. 2019లో జరిగిన ఎన్నికల్లో బొబ్బిలి అసెంబ్లీ స్థానంలో 1942 మంది ఉద్యోగులు, చీపురుపల్లిలో 923 మంది, గజపతినగరంలో 1374 మంది, నెల్లిమర్లలో 1098 మంది, విజయనగరంలో 1927, ఎస్.కోటలో 1435 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్లు వేశారు. ఈ సారి జరిగిన ఎన్నికలో రాజాం అసెంబ్లీ స్థానంలో సుమారు 2116 మంది, బొబ్బిలికి 2493 మంది, చీపురుపల్లికి 1450మంది, గజపతినగరంకు 2090 మంది, నెల్లిమర్లకు 1760 మంది, విజయనగరంలో 4200 మంది, ఎస్.కోటలో 2005 మంది ఉద్యోగులు ఓటు వేశారు. వీరే కాకుండా అత్యవసర విభాగం సేవలు అందించిన ఉద్యోగులతోపాటు సర్వీసు ఓటర్లు కూడా దాదాపు 6 వేలు మంది ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గత ఎన్నికల్లో ఉద్యోగులంతా టీడీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారన్న అభిప్రాయం ఉంది. ఈ సారి ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. 2019లో తక్కువ ఓట్లతో గెలిచిన అభ్యర్థులకు ఈ సారి పోస్టల్ బ్యాలెట్లు వారికి వ్యతిరేకంగా పడినట్లు తెలుస్తోంది. దీనివల్ల కొద్దిపాటి ఓట్ల తేడాతోనూ కొందరి భవితవ్యం అటుఇటు కావొచ్చునని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.





కల్కి... నాకు చాలా లక్కీ

ప్రభాస్

"కల్కి 2898 ఏడి' చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మా బక్క డైరెక్టర్ (నాగ్ అశ్విన్) బుజ్జితో నన్ను మూడేళ్లు టార్చర్ పెట్టాడు. బుజ్జి (కారు) బ్రెయిన్ చిన్నదైనా నా బుర్రంతా తినేసింది. ఈ సినిమాలో బుజ్జి, భైరవ, నాగ్ అశ్విన్ ప్రతిభ ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది' అని ప్రభాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా, అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి అగ్రతారలతో రూపొందుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడి'. దీపికా పదుకొనే కథానాయిక. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. జూన్ 27న ఈ చిత్రం విడుదలవుతోంది. భారీ ఖర్చుతో తెరకెక్కిన ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను కూడా వినూత్నంగా భారీతనం ఉట్టిపడేలా నాగ్ అశ్విన్ నేతృత్వంలో చిత్రబృందం నిర్వహిస్తోంది. బుధవారం 'కల్కి' చిత్రబృందం హైదరాబాద్‌లో 'క్యూట్ స్టార్ బుజ్జి' అనే కారును పరిచయం చేస్తూ బుజ్జి వర్సెస్ భైరవ పేరుతో భారీ ఈవెంట్‌ను నిర్వహించింది. చిత్రబృందంతో పాటు ప్రభాస్ అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బుజ్జి కారును నడుపుతూ ప్రభాస్ సందడి చేశారు. దీనికి సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ 'నేను చాలా లక్కీ. అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్ లాంటి దిగ్గజాలతో నటించే అవకాశాన్ని 'కల్కి' నాకు ఇచ్చింది. కమల్‌సార్‌కి వంద దండాలు. ఇండియా గర్వించే నటుడు అమితాబ్. ఆయన స్ఫూర్తితోనే చాలామంది సినిమాల్లోకి వచ్చారు. 'సాగరసంగమం' చిత్రంలో కమల్‌హాసన్‌ను చూసి ఆయన వేసుకున్న దుస్తులు లాంటివి, కుట్టించుకొని వేసుకున్నాను. ఆ సినిమాలోని ఓ పాటలో ఆయన తలను లయబద్ధంగా ఊపే నాట్య భంగిమ చూసి నేను కూడా అలా చేయాలని ప్రయత్నించాను. దీపిక లాంటి ఇంటర్నేషనల్ స్టార్ ఈ సినిమాలో ఉండడం సంతోషం. దిశా అద్భుతమైన నటి. అశ్వనీదత్ గారు ఈ వయసులోనూ చాలా కష్టపడుతున్నారు. ఆయన ప్యాషన్ చూసి చాలా నేర్చుకోవాలి. సినిమా గ్రాండ్‌గా రావడానికి ఖర్చుకు వెనుకాడ లేదు. నిర్మాతగా 50 ఏళ్ల పాటు ఇండస్ట్రీలో ఉన్నది బహుశా ఆయనొక్కరే. మొదటి చిత్రాన్నే ఎన్టీఆర్‌తో చేశారంటేనే ఆయన రేంజ్ తెలుస్తుంది. వారి కూతుళ్లు స్వప్న, ప్రియాంక గారికి సైతం అదే ప్యాషన్, తెగింపు వచ్చాయి. వారిని చూసి ఎలా పనిచేయాలో నేర్చుకోవాలని మా చెల్లెళ్లకు చెబుతుంటాను' అన్నారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ 'బుజ్జి... పేరు చిన్నగా అనిపిస్తుంది గానీ, అది చేసే పని మాత్రం మామూలుగా ఉండదు. ఈ సినిమాలో బుజ్జి చాలా స్పెషల్. ఇలాంటి కార్‌ను ఇంజనీరింగ్ చేయడం చాలా కష్టం. ఒక కొత్త తరహా కారు తయారు చేయాలంటే పెద్ద టీమ్ ఉండాలి. ఆనంద్ మహీంద్రా గారు ఆ టీమ్‌ను పంపడం వల్లే బుజ్జి అనే కల సాకారమైంది. దీని తయారీలో మా టీమ్ కూడా చాలా కష్టపడింది' అన్నారు. అశ్వనీదత్ మాట్లాడుతూ "కల్కి' సినిమా గురించి ఒక్కటే మాట చెబుతాను. ఇది రిలీజయ్యేంత వరకూ చిన్న సినిమా. రిలీజయ్యాక చాలా పెద్ద సినిమా' అని అంచనాలు మరింత పెంచారు.

ఇకపై థియేటర్లకు పర్సంటేజ్ చెల్లించాల్సిందే




ఇతర రాష్ట్రాల తరహాలో నిర్మాతలు పర్సంటేజీ చెల్లించాలనీ, ఇకపై అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించమని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. నష్టాలను తట్టుకోలేక . పదేళ్ల కాలంలో దాదాపు రెండు వేల సింగిల్ స్క్రీన్ థియేటర్లు మూత పడ్డాయని ఆయన వెల్లడించారు.. బుధవారం సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ 'థియేటర్లు, ఎగ్జిబిటర్ల సమస్యలపై ఇటీవల తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, పలువురు పంపిణీదారులు, నిర్మాతలు, ఎగ్జిబిటర్స్‌తో సమావేశమై ఎగ్జిబిటర్స్‌కు వాటాలపై కొన్ని ప్రతిపాదనలు తయారు చేశాం. దీనిపై నిర్మాతలకు జులై ఒకటి వరకూ గడువు ఇస్తున్నాం. అయితే 'కల్కి 2898 ఏడీ', 'పుష్ప 2', 'గేమ్ ఛేంజర్', 'భారతీయుడు 2' చిత్రాలకు మినహాయింపు ఇస్తున్నాం. ఇతర సినిమాలను పర్సంటేజ్ విధానంలోనే ప్రదర్శిస్తాం. కొంతమంది డిస్ట్రిబ్యూటర్స్ సినిమా వ్యాపారాన్ని జూదంలా మార్చారు. బెనిఫిట్ షోలు, అదనపు ఆటలతో మోసాలకు పాల్పడుతున్నారు. అందుకే ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు ఆటలు ప్రదర్శించం' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి బాలగోవింద రాజ్, రవీంద్ర గోపాల తదితర సభ్యులు పాల్గొన్నారు.



లవ్ మీ.. ఓ డిఫరెంట్ ఫిల్మ్

టాలెంటెడ్ యాక్టర్స్ ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'లవ్ మీ' చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. విడుదల నేపథ్యంలో హీరో ఆశిష్ బుధవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.

- నేను ఇదివరకు చేసిన సినిమాలకు భిన్నంగా డార్క్ తరహాలో నా పాత్ర ఉంటుంది. ఎవరైనా ఓ పని చేయవద్దని చెబితే మొండిగా అదే పని చేసే పాత్ర అది. ఇందులో యూ ట్యూబర్‌గా నటించాను. అతని దగ్గరకి ఓ దెయ్యానికి సంబంధించిన కథ వస్తుంది. అప్పుడు అతని జీవితంలో ఏం జరిగిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు అరుణ్‌తో మాట్లాడి హీరో పాత్ర ఎలా కనిపించాలనుకుంటున్నారో తెలుసుకుని ఆ రకంగా నటించా
- ఈ సినిమాలో ఐదారుగురు హీరోయిన్లు ఉంటారు. అయితే సినిమా మొత్తం వారు కనిపించరు. గెస్ట్‌లా అలా వచ్చి వెళుతుంటారు. ఇందులో వైష్ణవిది దెయ్యం పాత్ర కాదు. దివ్యావతి ఆ పాత్ర పోషించారు. వైష్ణవి మరో కీలక పాత్ర పోషించారు.
- ఇందులో నటించడానికి ముందు 'చంద్రముఖి', 'ముని' వంటి సినిమాలు చాలా చూశాను. ఇందులో హారర్ ఒక భాగం మాత్రమే. మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది. సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత ఓ డిఫరెంట్ మూవీ చూశామని ప్రేక్షకులు సంతృప్తి చెందుతారు.
- దర్శకుడు అరుణ్ నవలా రచయిత. ఈ కథను ఆయన చెప్పిన తీరు నాకు బాగా నచ్చింది. దెయ్యంతో మాట్లాడడం, రొమాన్స్ చేయడం.. వంటి అంశాలు కొత్తగా అనిపించాయి. పీసీ శ్రీరామ్, కీరవాణి వంటి లెజెండ్స్ మా సినిమాకు పని చేయడం అంగీకరించడం మాకు ప్లస్ పాయింట్. దర్శకుడు కథ చెప్పిన విధంగా తీస్తాడా అని ఆలోచించి, మొదట పదిహేను రోజులు షూటింగ్ చేసి, బాగా వచ్చిందంటే ముందుకు వెళదాం .. అనుకున్నాం. ఆ సీన్స్ బాగా రావడంతో ప్రొసీడ్ అయ్యాం.
- ఈ సినిమా తర్వాత సెల్ఫిష్ ఉంటుంది. ఆ తర్వాత సితార బేనర్‌లో ఓ సినిమా చేయబోతున్నా.



మోదీ చిత్రంలో నటించడం లేదు

భారత ప్రధాని నరేంద్ర మోదీ బయోపిక్‌లో తను నటించడం లేదని తమిళ నటుడు సత్యరాజ్ స్పష్టం చేశారు. 'ఆ సినిమా గురించి ఇంతవరకూ ఎవరూ నన్ను అడగలేదు. నిరాధారమైన ఇలాంటి వార్తలు ఎలా పుడతాయో ఆశ్చర్యంగా ఉంది. ఇదంతా సోషల్ మీడియా సృష్టే. ఒకవేళ వారెవరైనా నన్ను అడిగినా ఆ చిత్రం చేయను. నేను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకోను' అని ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారాయన.

పారిపోయే పిరికిదాన్ని కాదు



నేను భయంతో పారిపోయే పిరికిదాన్ని కాదు.. నాకు కొంత బ్రీథింగ్ ప్లేస్ కావాలి. అందుకే రెండు రోజుల్లో మీడియా ముందుకు వస్తా. అందరి పని చెప్తా' అన్నారు నటి హేమ. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను పాల్గొనలేదని ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ ఆమె మరోసారి స్పష్టం చేశారు. ఈ రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ కూడా ఉన్నారని బెంగళూరు పోలీస్ కమిషనర్ వెల్లడించిన తర్వాత కూడా తను హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ పేర్కొనడం గమనార్హం. రెండు రోజుల నుంచి కొన్ని వందల ఫోన్ కాల్స్‌కు రిప్లయి ఇస్తున్నాననీ, నిజంగా అంత పెద్ద ఇష్యూలో ఉంటే ఫోన్ తన దగ్గర ఎలా ఉంటుంది అని హేమ ప్రశ్నించారు. తన జీవితంతో ఎవరు ఇలా ఆడుకుంటున్నారో, దీని వెనుక ఏ వెధవలు కుట్ర పన్నుతున్నారో కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నాననీ, అన్నీ తెలుసుకుని మీడియాకు చెబుతానని ఆమె అన్నారు. బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో నటి హేమ కూడా పాల్గొన్నారనీ, డ్రగ్స్‌తో దొరికారని నటి కరాటే కల్యాణి సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే పోలీసులకు దొరికిపోయి కూడా హేమ ఇంకా బుకాయిస్తున్నారని 'బిగ్‌బాస్'లో పాల్గొన్న తమన్నా సింహాద్రి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉంటే బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో తను కూడా ఉన్నానంటూ వచ్చిన వార్తలను యాంకర్ శ్యామల ఖండించారు. ఓ పార్టీకి మద్దతు పలికినందుకే తన గురించి ఇలాంటి ప్రచారం చేస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు.

నడకా.. నరకమే!



వీఆర్ అగ్రహారంవద్ద గుంతలను మట్టితో పూడ్చిన దృశ్యం



వీఆర్ అగ్రహారం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- మట్టితో గుంతలు కప్పుతున్న వైనం

రాజాం రూరల్: గ్రామీణ ప్రాంత రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ మరమ్మతులు కోరుతున్నాయి. అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం అధికారంలో పల్లె రహదారులకు మోక్షం కలగలేదు. గ్రామాల అభివృద్ధి పక్కనపెడితే.. ఊర్లోకి వెళ్లాలంటే భీతిల్లాల్సిన దుస్థితి నెలకొంది. కొత్త రహదారుల ఏర్పాటు సరేసరి.. 2014-19 మధ్యకాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న కాలంలో వేసిన బీటీ రహదారులకైనా కనీసం మరమ్మతులు చేయించని దుస్థితి కనిపిస్తోంది. ఎక్కడికక్కడ గోతులేర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ట్రాక్టర్లతో మట్టి తరలించే డ్రైవర్లు కొందరు గోతుల్లో మట్టిపోస్తున్నారు. వారం తిరిగేసరికి అక్కడ యథాతథ స్థితి నెలకుంటోంది. ఈ రహదారులపై ప్రయాణించే వాహనదారులకూ అవస్థలు తప్పడం లేదు.

● అంతటా ఇదే పరిస్థితి..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాజాం-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో వి.ఆర్.అగ్రహారం కూడలి నుంచి జి.సిగడాం మండలం పెంట వరకూ సుమారు ఏడు కిలోమీటర్ల మేర బి.టి. రహదారి నిర్మించారు. ఈ రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. ఇదే మార్గంలో పొగిరి జంక్షన్ నుంచి బొడ్డవలస వరకూ నిర్మించిన బీటీ రహదారి గోతులమయంగా మారింది. రాజాం-విజయనగరం మార్గంలోని కొత్తవలస జంక్షన్ నుంచి మారేడుబాక, ఇల్లంనాయుడువలస మీదుగా రింగ్‌రోడ్డుకు, గార్రాజు చీపురుపల్లి జంక్షన్ నుంచి బి.ఎన్.వలస, ఎంజెవలస, మీదుగా రాజాం-బొబ్బిలి రోడ్ వరకూ రింగురోడ్డు సైతం అధ్వానంగా మారింది. బొద్దాం నుంచి సోపేరు, రాజాం-పాలకొండ రోడ్‌లో డోలపేట నుంచి గడిముడిదాం, అమరాం, దోసరి రోడ్, కంచరాం నుంచి ఆగూరు మీదుగా దోసరి రోడ్డుపైనా నడక నరకంగానే మారింది. రాజాం పట్టణం కేంద్రంగా శ్యాంపురం మీదుగా నందబలగ, లక్ష్మీపురం, కొఠారిపురం మీదుగా రాజాం-విజయనగరం రోడ్‌ను కలిపే రింగురోడ్డు మరమ్మతులకు గురైంది. వాహన చోదకులు అనుభవిస్తున్న వెతలను దృష్టిలో పెట్టుకుని కొన్నిచోట్ల స్థానిక నేతలు మట్టితో గోతుల్ని పూడుస్తున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

చీపురుపల్లి, మే 22: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కర్లా గ్రామానికి చెందిన మరువాడ లక్ష్మణ (22) గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమించాడు. ఈ క్రమంలో కులాంతర వివాహానికి పెద్దలు అంగీకరించరన్న భయంతో పాటు గ్రామంలో అందరికీ విషయం తెలిసిపోయిందన్న బాధతో మనస్తాపం చెందాడు. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లాడు. మరునాడు ఉదయాన్నే గ్రామానికి సమీపంలోని ఓ జీడిలో చెట్టుకు వేలాడుతూ శవమై కనిపించాడు. మృతుని సోదరుడు మరువాడ రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఘటనా స్థలాన్ని సందర్శించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నేలబావిలో పడి ఒకరి మృతి

దత్తిరాజేరు: మండలంలోని చినకాదపంచాయతీ రాజులపేటలో ప్రమాదవశాత్తు నేలబావిలో పడి విశాఖ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న శివాజీకుమార్ మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. పెదమానాపురం పోలీసుల కథనం మేరకు.. విశాఖపట్నం జిల్లా నక్కవానిపాలెంకు చెందిన కునుచర్ల శివాజీకుమార్(60) తన స్నేహితుడు రాజులపేట గ్రామానికి చెందిన బుద్ధ, రమేష్‌రాజు గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత పండుగకు ఆహ్వానించడంతో స్నేహితులతో కలిసి మంగళవారం వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసి సరదాగా వెళ్లేందుకు బయటకు వెళ్తానని చెప్పాడు. సాయంత్రానికి రాకపోవడంతో వెతికారు. ఇంతలో 66 గ్రామ సమీపంలోని నేలబావి వద్ద దుస్తులు, షూ కనిపించాయి. బావిలో పరిశీలించగా శివాజీకుమార్ మృతదేహం కనిపించింది. బహిర్భూమికి వెళ్లిన తరుణంలో ఈ ప్రమాదం జరిగి ఉంటుంది. శివాజీకుమార్‌కు భార్య శారదాదేవి, కుమారుడు భార్గవరాజు ఉన్నారు. సరదాగా పండగకు వచ్చి మృత్యువాత పడడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రానికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడు భార్గవరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

రాజాం రూరల్, మే 22: మండల పరిధిలోని బొద్దాం గ్రామ సమీపంలో బుధవారం సాయంత్రం ఆటో బోల్తాపడిన ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. చీపురుపల్లి నుంచి రాజాం వైపు వస్తున్న ఆటో బొద్దాం వద్ద మేక అడ్డంగా రావడంతో అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని రాజాం సామాజిక ఆసుపత్రికి 108 వాహనంలో తరలించి ప్రాథమిక చికిత్స అందజేస్తున్నారు. రాజాం పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

టీడీపీ సీనియర్ నేత అనంతయ్య మృతి



శృంగవరపుకోట రూరల్: మండలంలోని బొడ్డవర గ్రామానికి చెందిన యనమదల అనంతయ్య చౌదరి (86) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. 1980 దశకంలో నియోజవర్గంలో వ్యవసాయాధికారిగా వచ్చిన ఆయన ఈ ప్రాంత రైతులకు వ్యవసాయంపై మక్కువ పెంచడంతో పాటు విభిన్నమైన పంటలు వేయడం, రైతులను ఆర్థికంగా అభివృద్ధి పరచడంలో కీలకపాత్ర పోషించారు. తన పదవీ విరమణ అనంతరం సొంత గ్రామం వెళ్లకుండా ఎన్టీఆర్ స్ఫూర్తితో ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి 1990 నుంచి పెద్దఎత్తున కృషి చేశారు. జిల్లా తెలుగురైతు అధ్యక్షుడిగా, కొత్తవలస మార్కెట్‌కమిటీ అధ్యక్షుడిగానూ పనిచేశారు. ఎస్.కోట ప్రాంతంలో బీఈడీ విద్యాసంస్థలు స్థాపించి విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఈయన మృతికి మాజీ ఎమ్మెల్యేలు శోభా హైమవతి, కోళ్ల లలితకుమారీ, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తదితరులు సంతాపం తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ చోరీ

శృంగవరపుకోట రూరల్, మే 22: మండలంలోని సంతగైరమ్మపేట రైతుల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే విలువైన కాపర్‌ను దొంగలు ఎత్తుకెళ్తున్నారు. దీనివల్ల రైతులు తమ పంటలకు నీరు సకాలంలో అందించలేక ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం వేకువజామున సంతగైరమ్మపేట పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న కాపర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై రైతులు గోగాడ ఈశ్వరరావు, గనివాడ రవిరాఘవ, గోగాడ దేముడు మాట్లాడుతూ ఇలాంటి చోరీల వలన ఎండకాలంలో తమ పొలాలకు నీరు అందించలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీనిపై పోలీసులు దృష్టిసారించి దొంగలను పట్టుకోవడంతో పాటు విద్యుత్‌శాఖ వారు వెనువెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు వేయాలని కోరుతున్నారు. రెండునెలల క్రితం జామి మండలంలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లలో ఉండే కాపర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారని రైతులు చెబుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు

డీజేలు వినియోగిస్తే కఠిన చర్యలు



డీజే యజమానులకు కౌన్సిలింగు నిర్వహిస్తున్న సీఐ వెంకటరావు

విజయనగరం క్రైం, మే 22: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ముగిసినప్పటికీ, ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తూ డీజే సౌండ్స్ వినియోగిస్తే, కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ బి వెంకటరావు హెచ్చరించారు. బుధవారం ఎస్పీ దీపిక పాటిల్ ఆదేశాలతో నగరంలోని డీజే సౌండ్స్, లైటింగ్స్ యాజమానులను పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే, చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఎక్కడైనా అల్లర్లకు పాల్పడితే, కేసులు నమోదు చేస్తామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించే వారిని ఇప్పటికే స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించామని, అటువంటి వ్యక్తులు ఎక్కడైనా అల్లర్లకు పాల్పడితే, రౌడీషీట్స్ తెరుస్తామన్నారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు తప్పనిసరి



మాట్లాడుతున్న అన్నపూర్ణ

రామభద్రపురం, మే 22: ఉపాధిహామీ పథకం పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కనీస సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం విజయనగరం జిల్లా అంబుడ్స్ ఉమెన్ శతపతి అన్నపూర్ణ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి కొత్త పనులు మంజూరుతో పాటు ఎస్సీ, ఎస్టీ, వికలంగులకు ఖచ్చితంగా వంద పని దినాలు ఉండేటట్లు ప్రణాళిక సిద్ధం చేశారని, పని ప్రదేశాల్లో మంచినీటి సరఫరా, వైద్య సౌకర్యాలు కల్పిస్తూ నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మస్టర్లు వేసేటప్పుడు క్షేత్ర సహాయకులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది, ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సమావేశానికి ముందు గజపతినగరం క్లస్టర్ ఏపీడీ జనార్దనరావుతో కలిసి ఏపీవో త్రినాథరావు దుప్పలపూడి, ఇట్లామామిడిపల్లి గ్రామాల్లో పనులను, మస్టర్లను పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీవో త్రినాథరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సాంకేతిక సహాయకులు శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.

నేడు కోదండ రామాలయంలో భజనోత్సవం

విజయనగరం రూరల్: నగరంలోని కొత్తపేట, కోదండ రామాలయంలో వైశాఖమాస పౌర్ణ మి సందర్భంగా ప్రత్యేక భజనోత్సవ కార్యక్రమం గురు వారం జరగనుంది. సాయంత్రం 6 గంటల నుంచి ఉద యం ఆరు గంటల వరకూ 12 గంటల నిర్విరామ భజ నోత్సవం నిర్వహించనున్నారు. ఈసందర్భంగా కోదండ రామునికి మామిడి పండ్లు, పులిహోర, శనగలు ప్రసా దం నివేదించనున్నారు. అనంతరం ఆ ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. భజన చెట్టుకి దీపోత్సవం కార్యక్రమాన్ని కూడా నిర్వహకులు ఏర్పాటు చేశారు.

ప్రతి విద్యార్థికి విద్యాకానుక అందాలి

తెర్లాం, మే 22: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం సరఫరా చేసిన విద్యాకానుక ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం సీఆర్పీలు కీలకపాత్ర పోషించాలని సమగ్రశిక్ష సీఎంవో ఆదినారాయణ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని విద్యాకానుకల పంపిణీ కేంద్రాన్ని సమగ్ర శిక్ష కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కేంద్రంలోని వసతులు, బద్రతా ఏర్పాట్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఆర్పీలతో సమావేశమయ్యారు. విద్యాకానుకలో ప్రతి వస్తువు, పుస్తకాలు అందరికీ అందేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఆయనతో పాటు అసిస్టెంట్ సి.ఎం.ఒ. రామారావు, ఎంఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పైడిమాంబ ఆలయాల్లో చండీహోమం

విజయనగరం రూరల్, మే 22: పైడిమాంబ ఆలయాల(రైల్వే స్టేషన్ వద్ద వున్న వనంగుడి, మూడు లాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి)లో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఉదయం చండీహోమాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో డీవీ ప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. చాలా మంది భక్తులు రూ.500 దేవస్థానానికి చెల్లించి, ఈ చండీహోమంలో పాల్గొనేందుకు తమ పేర్లను రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే, గురువారం ఉదయం 9 గంటల్లోగా రూ.500 దేవస్థానం కౌంటర్‌లో చెల్లించి, తగిన రసీదు పొంది, చండీహోమంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

విజయనగరం దాసన్నపేట, మే 22: గ్రంథాలయ ఉద్యమ నేత రామలక్ష్మణమూర్తి సేవలు గొప్పవని జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, కోశాధికారి ఎర్రినాయుడు కొనియాడారు. రామలక్ష్మణమూర్తి జయంతిని పురస్కరించుకుని జీఎంఆర్ ఉపాధి శిక్షణ ప్రాంగణంలో గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవూఫ్ మాట్లాడుతూ, గ్రంథాలయాలు విద్యాభివృద్ధికి దోహదపడతాయన్నారు. విద్యార్థుల ఉన్నతికి గ్రంథాలయాలు ఉపయోగపడతాయని, ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ఉపాధి శిక్షణ సంస్థ ప్రతినిధి కేవీ రమణ, అధ్యాపకులు, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

రేగిడి, మే 22: రైతుకు కావాల్సిన విత్తనాలు కొరత లేకుండా ఆర్‌బీకేల ద్వారా అందించాలని, గతంవలే విత్తన కొరత లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఏపీ రైతుసంఘం కోరింది. ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు బుధవారం స్థానిక విలేఖర్లకు తెలిపారు. మండలకేంద్రంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఈఏడాది ఖరీఫ్ విత్తన పంపిణీపై పటిష్ట కార్యాచరణ ఉండాలని, రైతుకు అవసరమైన ఆర్‌జీఎల్, సాంబ తదితర రకాల కొరత లేకుండా చూడాలని సూచించారు. ఇటీవల కాలంలో ఆర్‌బీకెలు విత్తన పంపిణీలో విఫలం అయ్యాయని, ఈఏడాది పాత పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని అధికారులను ఏపీ రైతుసంఘం డిమాండ్ చేసింది.

విజయమోహన్‌కు ఇండియన్ ఐకాన్ అవార్డ్

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 22: బొబ్బిలికి చెందిన విజయమోహన్ జాతీయ స్థాయి ఇండియన్ ఐకాన్ అవార్డ్ అందుకున్నట్టు రాష్ట్ర ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం(డెల్టా) గౌరవ అధ్యక్షుడు గుంపస్వామి చెప్పారు. ఆయన బుధవారం స్థానిక విలేఖరులతో మాట్లాడారు. ఈ ఏడాది మార్చిలో ఇండియా టుడే మీడియా సంస్థ క్రైట్ క్రాఫ్ట్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో వివిధ రంగాల్లో ప్రతిభావంతులను ఎంపిక చేసిందని, ఆంగ్ల భాషాభివృద్ధికి చేస్తున్న కృషికి విజయ్‌మోహన్‌కు ఇండియన్ ఐకాన్ అవార్డును అందించిందన్నారు. అవార్డ్‌ను ఆ సంస్థ పంపించగా డెల్టా సభ్యులు రామకృష్ణ, శ్రీనివాస్, మురళి, జగన్‌మోహన్ ద్వారా ఆయన అందుకున్నారన్నారు.

సరే పోలమ్మకు వెండి ఆభరణాలు



ఆభరణాలతో దాతలు

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 22: బొబ్బిలి యుద్ధస్తంభం సమీపాన గల సరే పోలమ్మకు బుధవారం నాలుగు కిలోల వెండి ఆభరణాలను పట్నూరి నరేష్ దంపతులు అందించారు. అమ్మవారికి వెండి కిరీటం, అభయ హస్తాలు, వడ్డాణం, పల్లెం తదితర ఆభరణాలను అందించారు. వాటిని ఆలయ ధర్మకర్త బొద్దల సత్యనారాయణ సమక్షంలో సమర్పించారు.

కొనసాగుతున్న జిందాల్ కార్మికుల నిరసన



నిరసనలో వంటావార్పు అనంతరం కార్మికులకు భోజనాలు వడ్డిస్తున్న నేతలు

కొత్తవలస, మే 22 : మండలంలోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్ నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారం కార్మికులు బుధవారం తమ నిరసనను కొనసాగించారు. కర్మాగారం మూసేసినందున తమకు 20 రోజులకైనా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్మాగార ఉత్పాదకత వ్యయం పెరిగి పోవడం, ముడిసరుకు కొరత కారణంగా కర్మాగారానికి లాకౌట్ వేయాల్సి వచ్చిందని యాజమాన్యం చెబుతున్నందున, తమకు కనీసం 20 రోజులైనా పని కల్పించండి లేక పోతే 20 రోజులు వేతనాన్నయినా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు నిరసన శిబిరం వద్దనే వంటలు చేసుకుంటూ మధ్యాహ్న భోజనం చేస్తూ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. వీరి నిరసన కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి పార్టీలకు అతీతంగా నాయకులు మద్దతు ఇవ్వడమే కాకుండా కార్మికులు చేసే వంటా వార్పు కార్యక్రమానికి అవసరమైన బియ్యం, నిత్యావసరాలను అందజేస్తున్నారు. బుధవారం తుమ్మికాపల్లి గ్రామం నుంచి వంటా వార్పుకు అవసరమైన బియ్యం ,సరుకులు వచ్చాయి.

కౌంటింగ్ వరకూ రాళ్లు విక్రయించవద్దు

● అడిషనల్ ఎస్పీ సునీల్ షరోనా



క్వారీ పరిశీలిస్తున్న సునీల్ షరోనా

సీతానగరం: ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు రాళ్లు విక్రయించ వద్దని అడిషనల్ ఎస్పీ సునీల్ షరోనా స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని విప్పలవలస, నిడగల్లు మరిపివ లస, సూరమ్మపేట వద్ద ఉన్న క్వారీలను పరిశీలించారు. ఈ సందర్భంగా క్వారీ యజమానుల నుంచి లీజులు అనుమతులపై అడిగి తెలుసుకున్నారు. క్వారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ రవికుమార్ ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉండాలి: డీఎస్పీ



లివిరిలో మాట్లాడుతున్న కృష్ణారావు

భామిని: గ్రామాల్లో ఎటువంటి అలజడులకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఉండాలని పాలకొండ డీఎస్పీ కేవీవీ కృష్ణారావు కోరారు. బుధవారం లివిరి, బాలేరు, తాలాడలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో, గొడవలకు దిగితే కేసులు నమోదైతే ఎవరూ మిమ్మిల్లి కాపాడలేరని తెలిపారు. బత్తిలిలో 16 సారా కేసుల్లో స్వాధీనం చేసుకున్న 370 లీటర్ల సారా ధ్వసంచేశారు. ఆయన వెంట సీఐ చంద్రశేఖర్, బత్తిలి ఎస్ఐ సీహెచ్ ప్రసాద్ ఉన్నారు.

ఎస్.కోటలో దారగంగమ్మ ఉత్సవం



దర్శనమిస్తున్న అమ్మవారు, పండగలో గ్రామస్థులు

శృంగవరపుకోట, మే 22: శృంగవరపుకోట పట్టణంలో శ్రీదారగంగమ్మ తల్లి పండగ సందడి మెదలైంది. బుధవారం జంగిడి, పాల, కూటి ఘటాల ప్రదక్షణలు జరిపారు. గ్రామ ప్రజలు వీటితో పాటు పురవీధుల్లో తిరిగారు. దేవాలయంలో దారగంగమ్మ తల్లికి పూజారి రాజా పంతులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణ చేపట్టారు.

గజపతినగరంలో నీలమ్మతల్లి పండుగ



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

భామిని: మండలంలోని గజపతినగరంలో నీలమ్మతల్లి అమ్మవారి పండుగ బుధవారం సందడిగా నిర్వహించారు. ఐదు రోజులుగా సంప్రదాయబద్ధంగా అమ్మవారి పాదాలకు ముర్రాట నీళ్లతో కడుగుతూ ప్రత్యేక పూజల చేస్తున్నారు. పండుగ ముగింపు పురస్కరించుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బంధువులు, స్నేహితులను ఆహ్వానించడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

వేతనదారులకు సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

రాజాం: ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో వి శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రోజు వారి కూలీ గిట్టుబాటు కావాలని, కొత్తగా పనులు గుర్తించి చేపట్టాలని, మొక్కలు పెంపకం విషయంలో అందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎవరు నిరలక్ష్యం చేసినా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున పనులు జరుగుతున్న ప్రాంతాల్లో టెంట్‌లు. మజ్జిగ. మంచినీటి సౌకర్యం విధిగా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ సాయినాం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, మే 22: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ బకాయిలు వెంటనే చెల్లించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. బుధవారం అర్ అండ్ బీ సమీపంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆగస్టు నెల నుంచి నేటి వరకూ ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు 1,500 కోట్ల బిల్లులు బకాయిలు పడి చెల్లించలేదని, అందుకే ఆరోగ్యశ్రీ సేవలను ఆసుపత్రులు నిలిపివేసే పరిస్థితి నెలకొందన్నారు. ఏపీ ప్రైవేటు మెడికల్ అసోసియేషన్ కూడా ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేస్తున్నట్టు ప్రకటించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చామని చెబుతూనే ఆరోగ్య శ్రీ బిల్లులు చెల్లించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్సార్ బీమాలో కొన్ని ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రభుత్వం సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో బీమా క్లైయిమ్‌లు నేటికీ మరణించిన కుటుంబాలకు అందలేదన్నారు. ఈ సమావేశంలో నాగభూషణం, భాస్కర్, నాగేశ్వరరావు, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్టూనిస్టు గుంట్రెడ్డికి ఉత్తమ బహుమతి



బహుమతి స్వీకరిస్తున్న భాస్కరరావు

సాలూరు రూరల్ (బొబ్బిలి), మే 22: బొబ్బిలికి చెందిన కార్టూనిస్టు గుంట్రెడ్డి భాస్కరరావుకు హైదరాబాద్‌లో జరిగిన కార్టూన్ పోటీల్లో ఉత్తమ బహుమతి లభించింది. తొలి తెలుగు కార్టూనిస్ట్ తెలిపెట్టి రామారావు జయంతి సందర్భంగా బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో కార్టూన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బొబ్బిలికి చెందిన భాస్కరరావు వేసిన కార్టూన్ ఉత్తమ బహుమతి సాధించింది. ఆయనకు ఈ బహుమతిని సినీనటుడు హర్షవర్ధన్, సామాజికవేత్త సత్యవాణి అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషాభివృద్ధి సంఘం సభ్యుడు, మామిడి హరికృష్ణ పలువురు కార్టూనిస్ట్‌లు పాల్గొన్నారు.

ఉపాధి హౌసింగ్ చెల్లింపుల్లో జాప్యం తగదు



ఉపాధి ప్రగతిపై సమీక్షిస్తున్న రాజాం క్లస్టర్ ఏపీడీ

రేగిడి, మే 22: ఉపాధి హామీపథకంలో గృహనిర్మాణానికి చెల్లించాల్సిన ఉపాధి చెల్లింపుల్లో సిబ్బంది జాప్యం లేకుండా చూడాలని రాజాం క్లస్టర్ ఉపాధి ఏపీడీ మీసాల శ్రీనివాసరావు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. స్థానిక ఏపీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి ప్రగతిపై క్షేత్రసహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో ఏపీడీ వారాంతపు సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఉపాధి ప్రగతి, 90 రోజుల హౌసింగ్ బిల్లుల చెల్లింపులపై ఏపీడీ పంచాయతీల వారీగా ఆరా తీశారు. చెల్లింపుల్లో జాప్యం ఉన్న పంచాయతీలను గుర్తించి తక్షణమే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏపీవో హరనాథ్‌ను ఆదేశించారు. కొలతల ప్రాప్తికి వేతనదారులకు రూ. 300 వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఎన్ఎంఎంఎస్ యాప్‌లో హాజరు ఉండాలని సూచించారు. ఇంజినీరింగ్ కన్సల్టెంట్ రామినాయుడు, పలుగ్రామాల టెక్నికల్‌అసిస్టెంట్‌లు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఎస్.కోట ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న కోళ్ల లలిత కుమారి

కొత్తవలస, మే 22 : శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన కోళ్ల లలిత కుమారి తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి మృతి చెందిన, ప్రమాదంలో గాయపడి వారిని బుధవారం పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఒల్లుపుబంగార్రాజు(అయ్యప్ప) ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి 10 వేల రూపాయలను అందజేశారు. లలిత కుమారితో నాయకులు బొబ్బిలి అప్పారావు, గొంప దుర్గా ఉమేష్, కోళ్లవెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త చింతాడ అర్జునరావును బుధవారం టీడీపీ శాసనసభ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి పరామర్శించారు. కొత్తవలస మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన అర్జునరావు పోలింగ్ రోజున కాలువలో పడడంతో కాలికి బలంగా దెబ్బ తగిలింది. దీంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న లలిత కుమారి బాధితుడిని పరామర్శించి, ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. రూ.15వేలు ఆర్థిక సాయం చేశారు.

భానుడు భగభగ

- సాయంత్రం ఐదు గంటల వరకూ ఎండ తీవ్రత
- ప్రజలు, చిరు వ్యాపారుల అవస్థలు



ఎండ తీవ్రతతో గరివిడి ప్రధాన రహదారిపై మూతపడిన షాపులు

గరివిడి: భానుడి ప్రతాపానికి ప్రజలు ఠారెత్తిపోతున్నారు. ఎండల తీవ్రంగా ఉండడంతో చిరువ్యాపారులు రోడ్డుపై వ్యాపారాలు సాగించలేక అవస్థలకు గురవుతున్నారు. ఉదయం ఆరు గంటలకే ఎండ తీవ్రత మొదలవుతోంది. గరివిడి తది తర ప్రాంతాల్లో మధ్యాహ్నం 11నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు ఎండ తీవ్రతకు అత్యవ సరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి రోడ్డుపైకి రావడంలేదు. ప్రధానకూడళ్లు కర్ఫ్యూను తలపిస్తున్నాయి. ఎండ తీవ్రత వల్లతమ వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయని చిరు వ్యాపారస్థులు లబోదిబోమంటున్నారు. ప్రధానంగా కూరగాయలు ఎండిపోతుండడంతో నష్టపోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. ఎండకు ప్రజలు బయటకు రాకపోవడంతో వ్యాపారాలు పడిపోయావని పాన్‌షాప్‌లు, చిరు వ్యాపారులు చెబుతున్నారు. టైలర్లు, చేతివృత్తుల చిన్నచిన్న షాపుల్లో ఎండతీవ్రతకు తట్టుకోలేక ఉదయం పది గంటలకే మూతవేయిస్తున్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల గుర్తింపు


- జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్



పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమకుమార్

గంట్యాడ: జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్ చెప్పారు. బుధవారం మండలంలోని నరవ, గంట్యాడ గ్రామాల్లో ప్రత్యేక అవసరాల గల పిల్లల గుర్తింపు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి గ్రామంలోని ఒకటి నుంచి 14 సంవత్సరాలు వయస్సు గల ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారికి విద్యా బోధనతోపాటు ఫిజియోథెరఫీ చేయించడం, అంధులు, చెవిటి, మూగ పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం కోసం భవిత కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా 680 మంది పిల్లలును గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకూ 272 మందిని గుర్తించినట్లు చెప్పారు. అన్ని గ్రామాల్లో ఐఆర్‌ఈ టీచర్లు సర్వే చేస్తున్నారని , మరో పది రోజుల పాటు సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలోని ఎంఈవో విజయ లక్ష్మి, ఐఆర్‌టీ టీచర్లు చక్క రమేష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఘర్షణలు జరగకుండా చర్యలు: డీఎస్పీ



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

గంట్యాడ: గ్రామాల్లో పోలింగ్ అనంతరం ఎటువంటి ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీ ఆర్.గోవిందరావు సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని లక్కిడాం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ ముగిసినా ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణం ఉండాలని సూచించారు. ఎక్కడైనా ఘర్షణలు జరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు అంతా శాంతియుతవాతా వరణంలో ఉండాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలోని విజయనగరం రూరల్ సిఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.63 వేల విరాళం

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారంలో పైడితల్లమ్మ ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మండల పైడితల్లి రూ.63 వేలు విరాళంగా అందజేశారు. బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పిల్ల వెంకటరమణ, కోట్ల లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


- ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు



మాట్లాడుతున్న రామచంద్రరావు

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంఘం నెల్లిమర్ల తాలూకా అధ్యక్షుడు పి.వీరన్నదొర అధ్యక్షతన సంఘం నెల్లిమర్ల తాలూకా శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కారం జరగాల్సిన వాటిని రాష్ట్ర నాయకత్వానికి నివేదించి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఉద్యోగులుఐక్యంగా ఉన్నపుడే సమస్యల పరిష్కారంతో పాటు హక్కులను సాధించుకోవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కంది వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు పీవీ రమణ, పట్టణ శాఖ నాయకుడు చింతల వెంకటసతీష్, నెల్లిమర్ల తాలూకా అధ్యక్షుడు వీరన్నదొర, ప్రధాన కార్యదర్శి టి.శివప్రసాద్,అసోసియేట్ అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తి, కోశాధికారి ఎం.మురళి తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో నరసింహస్వామి జయంతి



స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవస్థానంలో నరసింహస్వామి జయంతిని అర్చకులు ఘనంగా నిర్వహించారు. దేవస్థానంలోని ఉప ఆలయంలో ఉన్న భూబుజంగ వరాహ లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో స్వామి వారికి పాలు, పెరుగు, నెయ్యి, తేనె,పంచదార, పళ్ల రసాలతో అభిషేకం చేశారు. అష్టోత్తర శత నామార్చన నీరాజన కార్యక్రమం అర్చకులు జరిపించారు. పూజలు, అభిషేకాలను ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అర్చకులు ఖండవిల్లి కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవన్‌కుమార్, రామ్‌గోపాల్ పాల్గొన్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపు

- ఎన్నికల ముందు భవనాలు అప్పగింత
- ఇదీ గజపతినగరం మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి



పాతబగ్గాంలో బిల్లులు చెల్లించని అంగన్‌వాడీ భవనం

గజపతినగరం: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పనులకు సంబంధించి బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. పలుచోట్ల చిన్నచిన్న పనులు నిలిచిపోవడంతో అధికారులు స్వాధీనం చేసుకుని పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో పెండింగ్ బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. టీడీపీ హయాంలో మంజూరయిన అంగన్‌వాడీ భవనాలకు నేటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. అప్పులుచేసి ఇప్పటివరకు పనులు చేశామని వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మంజూరయిన భవనాలను అప్పట్లో ఆ పార్టీకి చెందిన నాయకులు పనులు చేపట్టారు. పనులు చేపడుతున్న తరుణంలో వైసీపీ అధికారంలోకి రావడంతో టీడీపీ నాయకులు చేపట్టిన పనులకు అడ్డంకులు సృష్టించారు. పనుల్లో నాణ్యత లేదని, బిల్లులు చెల్లింపుల్లో జాప్యం చేసేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

అర్థాంతరంగా నిలిచిన పనులు..

మండలంలోని దావాలపేట, ఎం.గుమడాం, పాతబగ్గాం గ్రామాల్లో రూ. లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో అంగన్‌వాడీ భవనాల పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. పాతబగ్గాం 2లక్షల60వేలు, ఎం.గుమడాం 2లక్షల 50వేలు, దావాలపేట సుమారు 5లక్షల వరకు ఐదేళ్ల గడిచినా జరిగిన పనులకు బిల్లులు రాలేదు. దీంతో అప్పులు తీసుకొచ్చి నిర్మాణాలు చేపట్టామని, లక్షల రూపాయల్లో బిల్లులు నిలిచి పోయాయని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందన్న తరుణంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పెండింగ్ పనులు చేపడతామని బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్లు వారి మాటలు నమ్మి భవనాలను అధికారులకు అప్పగించారు. భవనాలను వినియోగంలోకి తీసుకున్న అధికారులు నేటికీ బిల్లులు చెల్లించకపోవడం శోచనీయమని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరుజరిగేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కిట్లు కరువు.. టెంట్లు లేవు

- ఇదీ ఉపాధి పనుల వద్ద పరిస్థితి



ఎం. కొత్తవలసలో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలు

గజపతినగరం: ఉపాధి పనులు నిర్వహిస్తున్న ప్రదేశాల్లో కనీస సౌకర్యాలను అధికారులు కల్పించకపోవడంతో వేతనదారులు అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా వేసవి కాలం కావడంతో వేతనదారులు ఎండతీ వ్రతకు అల్లాడిపోతున్నారు. కొద్దిరోజులుగా ఉష్ణోగతలు 45 డిగ్రీలు దాటిపో తున్నాయి. ఎనిమిది గంటలకే సూర్యుడు ప్రతాపం చూపుతున్నాడు. కొన్నిచోట్ల వడగాలులు కూడా వీస్తున్నాయి. దీంతో కూలీలు పనిచేసే చోట ఇబ్బంది పడుతున్నారు.పలువురు పనులు చేయలేక ఇంటిదారిపడుతున్నారు. ఈ నేపథ్యంలో పనిప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయడానికి, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వేతనదారులు వాపోతున్నారు.

అత్యవసర సమయంలో ఆస్పత్రులకు..

మండలంలోని 30 గ్రామపంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఎటువంటి ఉపాధి లేకపోవడం, వ్యవసాయ పనులకు విరామంకావడంతో ఎక్కువమంది పనులు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఉపాధి పథకం నిబంధనల మేరకు పనుల వద్ద నీడ, నీరు వంటి వసతులు కల్పించాల్సిఉంది. అయితే ఏ ఒక్క పనిప్రదేశంలో వసతులు కల్పించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కూలీలు ప్రమాదానికి గురైనా, అస్వస్థతకు చెందినా కిట్లు అందుబాటులో ఉండడం లేదు.దీంతో అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యసేవలు అందించాల్సి వస్తోంది. గతంలో ప్రథమచికిత్స కోసం కిట్లు పనుల వద్ద అందు బాటులో ఉండేవి. సాధారణంగా గ్రామాల్లో 60 ఏళ్ల పైబడిన వారు ఎక్కువ మందికి పనులకు వెళ్తున్నారు. పని సమయంలో వారికి ఎటు వంటి ప్రమాదం వాటిల్లినా కిట్లు లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందో ళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు

వసతులు కల్పిస్తాం..

పనుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఏపీవో రామారావు తెలిపారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకువస్తే వసతులు కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కలగా మినీ స్టేడియం

- పాలకుల హామీలు బుట్టదాఖలు
- నెల్లిమర్లలో క్రీడాకారుల అవస్థలు
- ఆట స్థలంపై వివాదం



అభివృద్ధికి నోచుకోని నెల్లిమర్ల క్రీడా మైదానం, వాలీబాల్ సాధన చేస్తున్న క్రీడాకారులు

(నెల్లిమర్ల)

క్రీడాకారుల అడ్డాగా పేరుగాంచిన నెల్లిమర్లలో మినీ స్టేడియం కలగా మిగిలిపోయింది. మినీ స్టేడియం నిర్మిస్తామని, క్రీడాకారులకు భరోసా ఇచ్చిన పాలకుల హామీలు బుట్టదాఖలయ్యాయి. నెల్లిమర్ల, పరిసర గ్రామాల ప్రజలకు అనువుగా నెల్లిమర్ల చంపావతి నది ఒడ్డున పెద్ద క్రీడామైదానం ఉంది. అయితే ఆ మైదానం అభివృద్ధి చేయకపోవడంతో పాటు ఇక్కడ క్రీడాకారులకు మౌలిక సదుపాయాలు కూడా లేవు. దీంతో ఈ మైదానాన్ని వినియోగించేందుకు క్రీడాకారులు ఆసక్తి చూపడం లేదు.

తాగునీటి బోరు.. డ్రెస్సింగ్ గది లేక

నెల్లిమర్లలో ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, రెజ్లింగ్ (కుస్తీ) తదితర క్రీడలకు చెందిన రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు, ఆయా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు అధిక సంఖ్యలో ఉన్నారు. నెల్లిమర్ల ఖోఖో క్రీడాకారుల ఖిల్లాగా ఉండగా, తామస్ పేటలో ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడాకారులు, కొండపేటలో కబడ్డీ క్రీడాకారులు, కొండగుంపాంలో కుస్తీ (రెజ్లింగ్) క్రీడాకారులు ఉన్నారు. వీరందరికీ ఈ మైదానమే దశాబ్దాల కాలంగా ప్రాక్టీసుకు వేదికగా ఉంది. అయితే కనీసం తాగు నీరు కోసం బోరు లేకపోవడం, యూనిఫారం మార్చుకునేందుకు కనీసం డ్రెస్సింగ్ రూమ్ కూడా లేకపోవడంతో క్రీడాకారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నెరవేరని హామీలు

ప్రధానంగా ఈ మైదానంలో బాలికలు కూడా అధిక సంఖ్యలో రోజూ ప్రాక్టీసుకు, శిక్షణకు వస్తుంటారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి కుస్తీ, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ క్రీడల్లో విజేతలుగా నెల్లిమర్ల క్రీడాకారులు నిలిచిన పలు సందర్భాల్లో సత్తాచాటారు. ఈ నేపథ్యంలో క్రీడాప్రాధికారిక సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇక్కడ మినీస్టేడియం నిర్మాణంతోపాటు వసతుల కల్పనపై దృష్టిసారించడంలేదని క్రీడాకారులు వాపోతున్నారు. గతంలో పలువురు ఎమ్మెల్యేలు నెల్లిమర్లలో క్రీడాకారుల సౌకర్యార్థం మినీ స్టేడియం నిర్మిస్తామని ఇచ్చిన హామీలు నెరవేరలేదు.

జూట్ మిల్లు అధీనంలో ఆటస్థలం

నెల్లిమర్లలో ప్రస్తుతమున్న క్రీడా మైదానం ప్రభుత్వాది కాకపోవడం, ఇది నెల్లిమర్ల జూట్ మిల్లు యాజమాన్యం అధీనంలో ఉండడం వల్లనే అడ్డంకులు ఏర్పడుతున్నాయని రాజకీయ వర్గాలు అంటున్నాయి. అయితే ఈ మైదానాన్ని ప్రభుత్వం మిల్లు యాజమాన్యం నుంచి తీసుకోలేని పరిస్థితుల్లో మిల్లు యాజమాన్యం అధీనంలోనే ఒక బోరు, డ్రెస్సింగ్ రూమ్ ఏర్పాటు చేస్తే సరిపోతుందని క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఆ దిశగా పాలకులు, అధికారులు అడుగులు వేస్తే నెల్లిమర్ల క్రీడాకారులు మరింత ప్రతిభ కనబరిచి జాతీయ, రాష్ట్ర స్థాయి పతకాలు తెచ్చే అవకాశం ఉంది.

కాలువల్లో చెత్త.. రోడ్లపై మురుగు



చాటాయివలసలో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

రేగిడి: మండలంలో చాటాయివలస పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. సిబ్బంది నిర్వహణ లోపం వల్ల కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రోడ్లపైకి మురుగునీరు చేరుతోంది. దీంతో పాదచారులు, వాహన చోదకులు అవస్థలకు గురవుతున్నారు. ప్రధానంగా బోర్లు, బావుల వద్ద వీధి కాలువల్లో చెత్త పేరుకుపోతోంది. దీంతో అక్కడి నీటినే తాగుతుండడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ పరిధిలో ఉప్పరనాయుడువలసతో కలిపి 1500 వరకు నివసిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది లేకపోవడం, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పారిశుధ్య నిర్వహణ రోజు రోజుకు తీసికట్టుగా మారుతోందని పలువురు వాపోతున్నారు.

పర్యవేక్షణ లేక..కార్యాలయం తెరవక

- ఇదీ వంగర వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ పరిస్థితి



వంగర: వంగరలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తి దారుల సంస్థ కార్యాలయం తెరవకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సంస్థ సిబ్బంది తెరవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు పండించే పంటలు కొనుగోలు, గిట్టుబాటు ధర కల్పనతోపాటు విత్తనాలు అందించడానికి ఈ కార్యాలయం ఏర్పాటుచేశారు. ప్రభుత్వం ఈ సంస్థ ద్వారా రైతులకు సూచనలు సలహాల ఇవ్వడం కోసం, ప్రత్యేక సమావేశాలు నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తోంది. అయితే సమావే శాలు నిర్వహణ పక్కన పెడితే కనీసం కార్యాలయం తెరవకపోవడంతో ఈ కార్యాలయం సేవలు అందని ద్రాక్షలా మిగిలాయని పలువురు రైతులు వాపోతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కార్యాలయం తెరిచి సేవలందేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

సీతంపేట: మండలంలోని గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రియ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు ఆర్బీకేల్లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.